కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు

- వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను ప్రవేశపెట్టినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్యారోగ్య రంగంలో గణనీయమైన మార్పులకు నాంది పలుకుతూ ఆరోగ్యశ్రీ అమలుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు లబ్ధిదారుని ఫొటో, కుటుంబ యాజమాని పేరు, ఫోన్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుతో పొందుపరిచిన ఆరోగ్య సమాచారం, ప్రత్యేకమైన ఎబిహెచ్ఎ ఐడితో కూడిన వివరాలు అందులో పొందుపరిచి ఉంటాయని అన్నారు.

తెలంగాణ విద్యుత్ బకాయిలపై సుప్రీంలో ఎస్ఎల్‌పి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జెన్‌కో బోర్డు సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ బాధ్యతను జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగించాలని నిర్ణయించారు. రాష్ట్రానికి బకాయిలు వెంటనే చెల్లించాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడం, హైకోర్టు కేంద్ర ఆదేశాలపై స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల మొత్తం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది.

పనిచేసే ప్రదేశాల్లో విద్యుత్ పొదుపు

- డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

మనం నివశిస్తున్న ఇంటిలోపాటు పని ప్రదేశాల్లో ఇంధన పొదుపు పాటించాలని, అందుకోసం అవసరమైన, సమర్థవంతమైన పద్ధతులు అవలంభించాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు నరేంద్ర ఎ పాటిల్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు జరుగుతున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందితో డిఆర్ఎం ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పొదుపు ద్వారా స్థిరమైన భవిష్యత్తును నిర్మించే దిశగా ముందుకు సాగవచ్చున్నారు. రైల్వే వర్క్‌షాపుల సెక్టారులో నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2023కి వ్యాగన్ వర్క్‌షాపునకు మొదటి బహుమతి రావడం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోవడం పట్ల సిబ్బందికి డిఆర్ఎం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం డి శ్రీనివాసరావు, ఎడిఆర్ఎమ్ ఆపరేషన్స్ ఎం శ్రీకాంత్‌తోపాటు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు.

కళాకారులు, వృద్ధులకు రైల్వే రాయితీలు పునరుద్ధరించండి

- ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కళాకారులు, వృద్ధులకు రైల్వే ప్రయాణ ఛార్జీల్లో గతంలో ఇచ్చిన మాదిరిగానే రాయితీలను పునరుద్ధరణ చేయాలని కేంద్రాన్ని వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. కళాకారులు, సీనియర్ సిటిజన్లకు కీలకమైన ఆర్థిక ఉపశమనాన్ని అందిస్తూ, ప్రస్తుతం ఉన్న సస్పెన్షన్‌ను పునఃపరిశీలించాలని రైల్వే మంత్రిని కోరారు. నృత్యం, సంగీతం, నాటకాలు వంటివి ప్రదర్శించే కళాకారులు, 50-75 శాతం రాయితీని పొందారు. ఇందులో సెకెండ్ క్లాస్, స్లీపర్ క్లాస్‌లలో 75 శాతం రాయితీ, 1ఎ తరగతికి 50 శాతం రాయితీ, ఎసి చైర్‌కార్, 3 ఎసి, 2 ఎసి ఉన్నాయని తెలిపారు. రాబోయే 26 జనవరి వేడుకలు, ఇతర ముఖ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రదర్శనలు ఉన్న నేపథ్యంలో ఈ రాయితీలను పునరుద్ధరించడం చాలా కీలకం అని అన్నారు.

కడప జిల్లాకు చెందిన కండక్టర్లను అక్కడికే బదిలీ చేయండి

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న కడప జిల్లాకు చెందిన కండక్టర్లందరినీ అక్కడికే బదిలీ చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డిని సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా వున్నప్పుడు భర్తీ చేసిన కడప జిల్లాకు చెందిన 287 కండక్టర్లు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లుగా ఇతర జిల్లాల్లోనే పనిచేస్తున్న వారిని కడప జిల్లాకు బదిలీ చేయాలని కోరారు

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మ్యాండెస్ విధానం రద్దు చేయాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం ఆందోళన బాట పట్టారు. ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు చేపట్టారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు 17 ఏళ్ల సర్వీసును గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పనులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వీరికి మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం అమల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జనవరి 5న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, కాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరంధామయ్య మాట్లాడారు. ప్రమాదాల్లో చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ఇటీవల మున్సిపాలిటీలోకి విలీనమైన గ్రామపంచాయతీలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్, చింతూరు ఐటిడిఎ వద్ద ఆందోళనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నెల్లూరులోని విఆర్‌సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తమ శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విజయవాడ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఎస్ఇ కార్యాలయాల ఎదుట విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తెలంగాణలో మాదిరి డైరెక్ట్ పేమెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపిఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్, సిపిడిసిఎల్ ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయాల ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. షిఫ్ట్ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, సెక్షన్ ఆపరేటర్లు, స్టోర్స్ పనిచేస్తోన్న హమాలీలకు కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. విజయవాడ గుణదలలోని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సంస్థలోని కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం బేసిక్ వేతనాలు చెల్లించి ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలీడేస్ వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కొత్తగా నియమితులైన షిఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్లుగా పనిచేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమితులైన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఇ, డిస్కం ఎస్ఇలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ ధర్నాలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతిలో స్థానిక శ్రీనివాసపురంలోని ఎస్‌పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కర్నూలులోని ఎస్‌సి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కడప విద్యుత్ భవన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్ఇ హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు ధర్నాను విరమించారు. విశాఖలోని గ్రీన్ పార్క్ ఎదురుగా ఉన్న ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఒంగోలులో ఆందోళన చేపట్టారు.

మిర్చి పైరును ధ్వంసం చేసి వైసిపి జెండా పాతారు

పల్నాడు జిల్లాలో దుండగుల దుశ్చర్య

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

రాజకీయ కక్షలు వ్యవసాయానికి పాకాయి. వైసిపి-టిడిపి విభేదాల కారణంగా మిర్చి పైరును ధ్వంసం చేశారు. టిడిపి నాయకులకు చెందిన మిరప పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో వైసిపి జెండాలు పాతారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ మండలంలో సోమవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగడ్డకు చెందిన టిడిపి గ్రామ అధ్యక్షులు బోడెపూడి వీరాంజనేయులు సోదరి వనజాక్షి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో మిర్చి పంట సాగు చేశారు. మరో 20 రోజుల్లో పంట కోతకు వస్తుందనగా గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను ధ్వంసం చేసి, పొలంలో వైసిపి జెండాలు పాతారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు గమనించి వెంటనే వనజాక్షి, వీరాంజనేయులకు సమాచారం ఇచ్చారు. పోలాన్ని చూసి బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. రాజకీయ కక్షతో, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోద్బలంతోనే ఇది జరిగిందని ఆరోపించారు. గతంలో వినాయకచవితి సందర్భంగా విగ్రహం ఊరేగింపు రోజున వైసిపికి చెందిన వారు కవ్వింపు చర్యలకు పాల్పడి తమపై దాడులు చేయడమే కాకుండా తమ కుటుంబీకులు 16 మందిపై అక్రమ కేసులు పెట్టారని, ఇప్పుడు ఎకరం మిర్చి పంటను ధ్వంసం చేశారని వాపోయారు. తాము ఆదివారం రాత్రి వరకూ పొలంలోనే ఉన్నామని, వైసిపి నాయకులు గతంలో పెట్టిన కేసు విషయంలో కోర్టు వాయిదాకు వెళ్లాల్సి ఉందని, దీన్ని అదునుగా చేసుకొని ఆ పార్టీ వాళ్లే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై వినుకొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంట ధ్వంసాన్ని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు ఓ ప్రకటనలో ఖండించారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పైరును ధ్వంసం చేసిన పాలంలో వైసిపి జెండా

వివేకా హత్య కేసులో మలుపు

- సునీత, ఆమె భర్త, సిబిఐ అధికారి రాంసింగ్‌పై కేసు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్ వివేకానంద హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. వివేక కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కేసు దర్యాప్తు చేపట్టిన సిబిఐ అధికారి రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసులో కొందరు తనను బెదిరిస్తున్నారని ఆయన పిఎ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టును ఆశ్రయించారు. హత్య కేసుకు సంబంధం లేని వారి పేర్లు చెప్పాలంటూ తనపై బలవంతం చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ శుక్రవారం పులివెందుల కోర్టు విచారించిందని, కేసును దర్యాప్తు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి 2024 జనవరిలో సమర్పించాలని పులివెందుల అర్బన్ కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు వైసిపి లీగల్ అడ్వైజర్ లాయర్ ఓబుల్‌రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు 352, 323, 330, 342, 348, 506, 195ఎ, 166ఎ(బి), 109 ఐపిసి ఆర్/డబ్ల్యు 156(3) సిఆర్‌పిసి కింద సిబిఐ అధికారి రాంసింగ్, వివేక కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డిలపై కేసు నమోదు చేశారని చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI చెంచుపేట బ్రాంచ్ గుంటూరు. ఫోన్: 08644-229244

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీత/లు, వారి చట్టబద్ధమైన వారసులకు మరియు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఋణగ్రహీత/లు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును సకాలంలో తిరిగి చెల్లించలేదు. అనేక పర్యాయములు అడిగినను/నోటీసులు పంపినా చెల్లించలేదు. కావున ఈ పత్రికాప్రకటన ద్వారా దిగువ మీకు తెలియజేయునది ఏమనగా తేది 28.12.2023, మధ్యాహ్నం 3.00 గం.ల లోగా బకాయి సొమ్ము, వడ్డీ & ఇతర ఖర్చులను కలిపి మొత్తంను బ్యాంకుకు చెల్లించి మీరు తాకట్టుగా ఉంచిన బంగారపు వస్తువులను విడిపించుకొనవచ్చును లేని యెడల సదరు బంగారు నగలను మా బ్యాంకు శాఖ ఆవరణలో "ఏది ఉందో అది అలాగే" అను ప్రాతిపదికన **తేది. 28.12.2023, సా॥ 4.00 - 4.30 గం॥లకు** బహిరంగ వేలము వేసి మీ పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఖాతాదారునికి ఎవరికైనను బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారు మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది. వేలంలో పాల్గొనదలచినవారు తప్పనిసరిగా బ్యాంకు నియమ నిబంధనలకు లోబడి బ్రాంచ్ మేనేజరు గార్ని షెడ్యూలు తేదీ/సమయంలోగా వారి KYC దాక్యుమెంట్లు మరియు ధరావత్తు రూ.5000/- సొమ్ము చెల్లించవలెను. వేలంలో హెచ్చు ధర పాడిన వారు 24 గంటలలోగా పూర్తి సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకొనవలెను లేనియెడల ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. అనక్షి ఉన్న వ్యక్తులు మాత్రమే వేలంలో పాల్గొనాలని మరియు మొత్తం బిడ్డింగ్ సమయంలో ఎవరైనా బిడ్డరు నామమాత్రంగా పాల్గొని, ఏ ఒక్క కోట్ చేయకపోతే, అటువంటి బిడ్డర్లు వారి ధరావత్తు సొమ్ము నుండి రూ.1000/- కోల్పోతారని, మిగిలిన మొత్తం మాత్రమే వాపసు చేయబడుతుంది. బ్యాంక్ యొక్క రిజర్వు ధర నుండి వేలం ప్రారంభమగును, బిడ్డర్లు వారి ఆఫర్ ధరను రూ.500/-ల గుణింపుతో పెంచించవలెను. వేలం నిలుపుదల చేయుటకు, పూర్తి/పాక్షికంగా రద్దు చేయుటకు గాని తేది/ప్రదేశం/సమయం మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు.

ఖాతా సంఖ్య	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు	నికర బరువు	చెల్లించవలసిన మొత్తం బకాయి (రూ.లలో)	NPA తేది
864677610008143	పైడిపాముల కిషోర్	45.00	39.30	1,70,217.64/- + వడ్డీ, ఛార్జులు	28.08.2023

తేది.18-12-2023, ప్రదేశం:చెంచుపేట — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

కొత్త బస్సులు ఎక్కడ?

- కాలం చెల్లిన వాటితోనే ఆర్‌టిసి ప్రయాణం
- టెండర్లు ఖరారు చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా రవాణా రంగంలో దేశంలోనే ప్రత్యేకతను చాటుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్ఆర్‌టిసి)ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. రాష్ట్ర విభజన నాటికి 13,000 బస్సులు కలిగి వున్న ఎపిఎస్ఆర్‌టిసిలో ఇపుడు హైర్ బస్సులను కలుపుకున్నా 10,500 వున్నాయి. ఇందులో 2,600 వరకు హైర్ బస్సులు. సాధారణంగా ప్రతియేటా మొత్తం బస్సుల్లో సగటున 15 నుండి 20 శాతం పాత బస్సులను తొలగించి వాటి స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేసే పద్ధతికి స్వస్తి చెప్పి హైర్ బస్సులను తీసుకునేందుకే ఇప్పుడు ఆర్‌టిసి పరిమితమవుతోంది. ఈ ఐదేళ్ల కాలంలో ఎపిఎస్ఆర్‌టిసి సొంతంగా ఒక్క బస్సునూ కొనుగోలు చేయలేదు. కొత్త బస్సుల కొనుగోలును పూర్తిగా అటకెక్కించడంతో రోజురోజుకూ ఆర్‌టిసిలో కాలం చెల్లిన బస్సుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కొత్త బస్సులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కాలపరిమితి తీరిన బస్సులనే నడపాల్సిన పరిస్థితి ఆర్‌టిసిలో నెలకొంది. సాధారణంగా ఏ బస్సయినా సగటున 12 లక్షల కిలోమీటర్లు నడవగానే దాన్ని పూర్తిగా పక్కన పెట్టేయాల్సిన ఆర్‌టిసి ఇప్పుడు అలాగే నడుపుతోంది. 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు దాదాపు 2,700 వున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుండి కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తున్నా.. టెండర్ల దశ కూడా దాటడం లేదు. ఆగస్టు నుండి అధికారులు అదిగో.. ఇదిగో.. అంటున్నారు తప్ప కొత్త బస్సులను తీసుకోవడం లేదు. డిసెంబరు చివరి నాటికి ఆర్‌టిసికి 1500 కొత్త బస్సులు వస్తాయని చెబుతూ వచ్చిన అధికారులు ఇపుడు 2024 ఏప్రిల్ నాటికి వస్తాయని చెబుతుండటంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు పోకుండా మొత్తం హైర్ బస్సులతోనే ఎపిఎస్ఆర్‌టిసిలో సర్వీసులు నడిపేలా ప్రభుత్వం నిర్ణయాల పట్ల ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

టిడిపి, జనసేనది ప్యాకేజీల బంధం

- ఎపిటిపిసి ఛైర్మన్ రవిచంద్రారెడ్డి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, జనసేన.. ప్రజల కోసం కాకుండా ప్యాకేజీల కోసమే కలుస్తున్నట్లు మరోసారి బహిర్గతమైందని ఎపిటిపిసి ఛైర్మన్, వైసిపి అధికార ప్రతినిధి పి రవిచంద్రారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జనసేనకు టిడిపి ఇస్తున్న ప్యాకేజీ సరిపోవడం లేదనే లోకేష్ పాదయాత్ర ముగింపు బహిరంగ సభకు హాజరయ్యేందుకు పవన్‌కల్యాణ్ నిరాకరించారని ఆరోపించారు. దీంతో చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగి పవన్‌కల్యాణ్‌తో ప్యాకేజీ చర్చలు జరుపుతున్నారని విమర్శించారు. టికెట్‌ల కేటాయింపునకు వచ్చేసరికి వీరి సంధి ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయని అన్నారు.

వైద్యం అందకుండా ప్యాకేజ్ పెంచితే ఉపయోగం ఏమిటి? : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాణాపాయ స్థితిలో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందనప్పుడు ప్యాకేజీ కింద రూ.25 లక్షలు పెంచినా? కోటికి పెంచినా? ఉపయోగం ఏమిటని టిడిపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించకుండా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దూరం చేసి ప్రచారార్భాటాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని విమర్శించారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా దళితులను తిట్టడం, ఐటి ఉద్యోగస్తులను నిందించటం, తమ పార్టీపై వ్యతిరేకత వచ్చేటట్లుగా వైసిపి కార్యకర్త మన్నిత్ కృష్ణారెడ్డి చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి నాయకునిగా వేషం వేయించిన సజ్జల భార్గవ్‌రెడ్డిపై సిఐడికి ఫిర్యాదు చేసినట్లు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఆదాయం పెంచాల్సిందే!

- వివిధ శాఖలకు ప్రభుత్వం సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆదాయాన్ని పెంచితీరాల్సిందేనని వివిధ శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. సోమవారం ఆర్థికశాఖ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సూచన చేసింది. వాణిజ్య, అటవీ, ఎక్సయిజ్, రెవెన్యూ, పోలీస్ వంటి శాఖల అధికారులతో ఆదాయం పెంపు, ఆదాయం క్రమబద్ధీకరణ వంటి అంశాలపై ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు విడివిడిగా భేటీ అయ్యారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయం, పెంచడానికి ఉన్న అవకాశాలను చర్చించారు.వాణిజ్య పన్నుల శాఖపై జరిగిన చర్చలో పన్నుల రూపేణా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచాలని, దీనికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుత పన్నుల లక్ష్యాలను నూరు శాతం సాధించడంతో పాటు, నూతన ఆదాయ మార్గాలను అన్వేషించాలని చెప్పారు. పాత బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం ద్వారా వస్తున్న ఆదాయంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఎంత ఆదాయం సమకూరింది, రానున్న కాలంలో ఎంత వచ్చే అవకాశాలున్నాయన్నది కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీ వల్ల ఆదాయ ప్రయోజనాలు ఎలా ఉన్నాయన్నది కూడా చర్చల్లో భాగంగా వచ్చినట్లు సమాచారం. అటవీ సంపదపై వచ్చే ఆదాయం, పర్యాటక రంగంపై ఆదాయం వంటివాటిపైనా చర్చ జరిగింది. పోలీసు అధికారులతోకూడా ఆదాయ మార్గాలపై చర్చ జరగడం విశేషం. వాస్తవానికి ఆదాయవనరుల శాఖల్లో ఇప్పటివరకు పోలీసు శాఖ లేదు. అయినప్పటికీ ఈసారి మాత్రం ఆ శాఖతోనూ చర్చ జరిగినట్లు తెలిసింది.

2047 నాటికి స్వావలంబనే లక్ష్యం : గవర్నర్

ప్రజాశక్తి - ఎస్వియు క్యాంపస్ (తిరుపతి జిల్లా)

2047 నాటికి భారత్ మహాశక్తివంతమైన దేశంగా నిలవనున్నదని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సోమవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికీ అందేలా అవగాహన కల్పించ